## క్లుప్తంగా

### దాహార్తిని తీర్చేందుకు చర్యలు



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ తిరుమల

**భీమారం:** మండలంలోని గ్రామాల్లో ఏర్పడ్డ మంచినీటి ఎద్దడిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జెడ్పీటీసీ బుక్యా తిరుమల పేర్కొన్నారు. మండలంలోని ఐటీడీఏ కాలనీలో దాహార్తి తీర్చేందుకు బోరుబావి నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. మంచినీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి బోరుబావులు నిర్మించేందుకు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌తో మాట్లాడినట్లు తెలిపారు. ఈ మేరకు 15బోరుబావులు మంజూరు చేసినట్లు జెడ్పీటీసీ తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, మండల నాయకులు పాడేటీ రవి, బుక్యా లక్ష్మణ్, కొత్త సత్తిరెడ్డి, వేల్పుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

### మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

**రామకృష్ణాపూర్:** స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రామగుండం థర్మల్ పవర్ ప్లాంట్‌తో పాటు ఆదిలాబాద్ జిల్లాలో సుమారు రూ.62వేల కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో మోడీకి ధన్యవాదాలు చెబుతూ క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాసు సత్యనారాయణ, వైద్య శ్రీను, కిషోర్, ప్రసాద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

### నేడు వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభం

**బెల్లంపల్లిరూరల్:** మండలంలోని కన్నాల రైతువేదికలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తున్నట్లు ఇన్‌చార్జీ మండల వ్యవసాయ శాఖ అధికారి వందన తెలిపారు. ఉదయం 11గంటలకు హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రారంభించనున్నట్లు సూచించారు. వ్యవసాయ సాగులో ఆధునిక సాంకేతిక విధానాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ, వ్యవసాయ శాఖ అనుబంధ రంగాల అధికారులు, రైతులు సకాలంలో కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

### స్థలం కోసం వినతి



సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

**బెల్లంపల్లి:** మున్సిపాలిటీలో యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించాలని కోరుతూ మంగళవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కాంగ్రెస్ నాయకులతో కలిసి హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సీఎండి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.

### విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

**దండేపల్లి:** మండలంలోని కాసిపేటకు చెందిన బలిజపెల్లి పాపయ్యకు చెందిన గేదె మంగళవారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. బాధితుడి కథనం ప్రకారం.. గోదావరిలో గేదె నీళ్లు తాగేందుకు వెళ్లే క్రమంలో విద్యుత్ మోటారుకు ఉన్న వైరు తగలడంతో, షాక్ తగిలి అక్కడికక్కడే చనిపోయింది. గేదె విలువ రూ.70వేల వరకు ఉంటుందని, తగిన పరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.

### చండీ సహిత రుద్రహోమం



**మంచిర్యాలఅర్బన్:** స్థానిక గౌతమినగర్ కోదండ రామాలయంలో మంగళవారం శ్రీ చండీ సహిత రుద్రహోమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు సురేఖ హోమంలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దండేపల్లి: ఓటు వేసేందుకు విద్యార్థుల క్యూ



నంనూర్‌లో ఓటరు వేలికి సిరా ఇంకు అంటిస్తూ...



రామకృష్ణాపూర్: పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

# విద్యార్థుల్లో ఎలక్షన్ జోష్..!

- పాఠశాలల్లో 'మాక్ పోలింగ్'
- నిజమైన ఎన్నికలను తలపించిన నమూనా ఎన్నికలు



నెన్నెల: ఓటు వేయడానికి క్యూలో నిలబడిన విద్యార్థులు

**రామకృష్ణాపూర్/నెన్నెల/కోటపల్లి/భీమిని/దండేపల్లి/లక్సెట్టిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్):** జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు మాక్ పోలింగ్(నమూనా ఎన్నికలు) నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణ, విత్‌డ్రా, బ్యాలెట్ పత్రాల తయారీ, ఎన్నికల అధికారుల విధుల తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ నమూనా ఎన్నికల్లో విద్యార్థులు ఎన్నికల్లో పోటీదారులుగా, ఓటర్లుగా ఎన్నికల సిబ్బందిగా, పోలీసులుగా విధులు నిర్వర్తించి అలరించారు. దీంతో పాఠశాలల్లో ఎన్నికల సందడి నెలకొంది. నిజమైన ఎన్నికలను తలపించడంతో విద్యార్థుల్లో జోష్ పెరిగింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా హెచ్‌ఎంలు వ్యవహరించారు. నెన్నెలలో ఓటింగ్ ప్రక్రియను డీఆర్‌డీఓ, స్వీప్ నోడల్ అధికారి కిషన్ పరిశీలించి ఓటింగ్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యం, ప్రభుత్వం పాత్రపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ ఎన్నికలు నిర్వహించామన్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం గెలుపొందిన అభ్యర్థులు ప్రమాణ స్వీకారం చేశారు.



కోటపల్లి: ఓటు వినియోగించుకుంటున్న విద్యార్థి



లక్సెట్టిపేట: పోలింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు



భీమిని: విధులు నిర్వహిస్తున్న విద్యార్థులు

## ఉపాధి హామీ పనుల్లో అవకాశం కల్పించాలి



డీఆర్‌డీఓను సన్మానిస్తున్న ఎంపీడీఓ, ఏపీఓ

**బెల్లంపల్లిరూరల్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో కూలీలుగా తమకు అవకాశం కల్పించి ఉపాధి అందేలా చూడాలని మండల ఐకేపీ వీవోఏలు కోరారు. బెల్లంపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ కిషన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల వీవోఏలు పోశం, వెంకటస్వామి, శ్రీవేణి, మహేష్, మాధవి, భాగ్య, సృజన, రేణుక, కవిత తదితరులు పాల్గొన్నారు.

**డీఆర్‌డీఓకు సన్మానం**

**నెన్నెల:** మండలానికి మొదటిసారి వచ్చిన నూతన డీఆర్‌డీఓ కిషన్‌ను మండల పరిషత్, సెర్ప్ సిబ్బంది మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సన్మానించారు. ఎంపీడీఓ, సెర్ప్, ఈజీఎస్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని డీఆర్‌డీఓ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, ఏపీఎంలు విజయలక్ష్మి, ప్రకాష్‌గౌడ్, ఈజీఎస్ ఏపీఓ నరేష్, సెర్ప్ సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

**మందమర్రిరూరల్:** ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో సేవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం సతీమణి, సేవాసమితి అధ్యక్షురాలు సవిత మనోహర్ హాజరై ప్రారంభించారు. త్రో బాల్, బాంబ్ బ్లాస్ట్, మ్యూజికల్ చైర్, ఉపన్యాస పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలిచిన మహిళలకు మహిళా దినోత్సవం సందర్భంగా జీఎం మనోహర్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్, డీవైపీఎం ఆసిఫ్, కమ్యూనికేషన్ సెల్ కో ఆర్డినేటర్ నెల్సన్, గ్రౌండ్ ఇన్‌చార్జి తిరుపతి తదితరులు ఉన్నారు.

**ముగ్గుల పోటీలు**

**లక్సెట్టిపేట:** మండలంలోని జెండావెంకటాపూర్‌లో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి మహిళా దినోత్సవం రోజున కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అధికారులు ముగ్గులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీపావతి, లిప్‌సికా, మౌనిక, ఎంపీటీసీ సరిత, మాజీ సర్పంచ్ సునీత, నాగలక్ష్మి, మంగలక్ష్మి, రమ, సత్యావతి, విజయలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

## చెన్నూర్ ఆర్వోగా చంద్రకళ



ఆర్వోకు పుష్పగుచ్ఛం ఇస్తున్న తహసీల్దార్

**చెన్నూర్:** చెన్నూర్ నియోజకవర్గ ఎన్నికల అధికారిగా చంద్రకళ పదవీ బాధ్యతలు చేపట్టారు. చంద్రకళ గద్వాల ఆర్డీవోగా విధులు నిర్వహించారు. బదిలీ పై చెన్నూర్ ఆర్వోగా వచ్చారు. ఇక్కడ ఆర్వోగా విధులు నిర్వహించిన సిడాం దత్తు భోధన్‌కు బదిలీ అయ్యారు. ఆర్వోగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆర్వోకు తహసీల్దార్ మల్లిఖార్జున్, ఎన్నికల డీటీ లక్ష్మీనారాయణ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఊరచెరువు మట్టి అక్రమ తరలింపు..!

- పట్టించుకోని అధికారులు



**మందమర్రిరూరల్:** మండలంలోని అందుగులపేట గ్రామపంచాయతీ పరిధిలోని ఊరచెరువులోని విలువైన మట్టి అక్రమంగా తరలింపునకు గురవుతోంది. జేసీబీతో తోడుతూ ట్రాక్టర్(నంబర్‌లేని)లతో వందలాది ట్రిప్పులు జాతీయ రోడ్డు పక్కనే ఉన్నటువంటి ఒక మాజీ ప్రతినిధి పెట్రోల్ బంకు వద్దకు తరలించినట్లు, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. గత నెల మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు ఊరచెరువు మట్టి అక్రమంగా తరలించుకు పోతున్నారని సంబంధిత అధికారుల సమక్షంలో ప్రశ్నించారు. అయినా ఈ అక్రమ మట్టి తరలింపు ఆగడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఇరిగేషన్ అధికారులు, పోలీసులు అక్రమ తరలింపునకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**ప్రమాదకర గుంత..**

జేసీబీలతో మట్టి తరలిస్తుండడంతో అవి ప్రమాదకరంగా మారుతున్నాయి. రెండు నెలల క్రితం ఓ బాలుడు ఈత కోసం వెళ్లి అక్రమంగా మట్టి తొలగించిన చోట గుంతలో పడి చనిపోయాడు. వర్షాకాలంలో ఆ గుంతలు నీటితో నిండి ఏర్పడకుండా తయారవుతుండడంతో, ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఏఈ రమ్యను 'సాక్షి' సంప్రదించగా ఊర చెరువులోని మట్టిని అక్రమంగా తవ్వినట్లు ఆనవాళ్లు గుర్తించి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మట్టిని అక్రమంగా తొలగించరాదని సూచించారు.

## సంక్షిప్త వార్తలు

**వినతిపత్రాలు అందజేత**

**మంచిర్యాలఅర్బన్:** ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలని, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా పరీక్షలకు వెళ్లేలా బస్సులు నడపాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిప్యూటీ సూపరింటెండెంట్ రాములుకు వినతిపత్రం అందజేశారు.

**జైపూర్:** మండలం రామారావుపేట శివారులో నూతనంగా నిర్మిస్తున్న సుముఖ అగ్రోస్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లు నిర్వాహకులు అక్రమంగా మట్టి తరలించారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీవోకు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. రెండ్రోజులుగా మళ్లీ అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లుగా వినతిపత్రంలో పేర్కొన్నారు.

**ఉపాధిహామీ పనుల పరిశీలన**

**జన్నారం:** మండలంలోని ఇందన్‌పల్లిలో ఉపాధిహామీ పనులు ఎంపీడీవో శశికళ పరిశీలించారు. సౌకర్యాలపై ఆరా తీశారు. ఎండలు పెరుగుతుండటంతో కూలీలకు నీరు, నీడ సౌకర్యం కల్పించాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు.

**సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం**

**కోటపల్లి:** కాంగ్రెస్‌పార్టీ ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఉచితబస్సు, 200యూనిట్ల ఉచితవిద్యుత్, రూ.500గ్యాస్ ఇచ్చినందుకు గాను మంగళవారం కొల్లూర్ గ్రామపంచాయతీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

**భీమారంలో కంటి శస్త్ర చికిత్సశిబిరం**

**భీమారం:** మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరం నిర్వహించారు. 120మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు సుగుణాకర్ రెడ్డి తెలిపారు.

**సన్మానం**

**బెల్లంపల్లిరూరల్:** మండల పరిధిలోని మాజీ సర్పంచులకు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో దత్తారావ్, ఎంపీపీ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై సన్మానం చేశారు.

**జన్నారం:** ఇటీవల వెలువడిన టీజీటీ ఫలితాలలో ప్రతిభ కనబరిచిన మహ్మదాబాద్ గ్రామానికి చెందిన దుర్గం అఖిలను నేతకానీ మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ నేత సన్మానించారు.

**నేడు బీఆర్‌ఎస్ నిరసన**

**చెన్నూర్:** పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ద్వంద వైఖరిని నిరసిస్తూ బుధవారం ఉదయం 10గంటలకు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు.

### దండేపల్లిలో ఇసుక అక్రమ రవాణా



**దండేపల్లి:** మండలంలోని కాసిపేట, గుడిరేవు గోదావరి తీరాల నుంచి ఇసుక అక్రమ రవాణ జోరుగా సాగుతోంది. ఎండ తీవ్రత పెరగడంతో నదిలో నీళ్లు అడుగంటాయి. దీంతో ఇసుక రవాణకు మార్గం సుగమం కావడంతో, నదిలోంచి ఇసుకను తోడి ట్రాక్టర్లలో నింపి తరలించాల్సిన చోటికి తరలిస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాల్సిన అధికారులు మామూలుగా వ్యవహరించడంతో, ఇసుక అక్రమ దందాకు అడ్డు అదుపు లేకుండా అయ్యింది. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



పాఠకులకు పుస్తకాన్ని చూపిస్తూ మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

**బెల్లంపల్లి:** జిల్లాలో ఉన్న గ్రంథాలయాల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. ఈ నెల 3న 'సమస్యల్లో లైబ్రరీలు' అనే శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలపై వార్తాకథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ మేరకు స్పందించిన జిల్లా అదనపు కలెక్టర్ మంగళవారం బెల్లంపల్లి శాఖ గ్రంథాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గ్రంథాలయంలోని పుస్తకాల గది, రిజిస్టర్లు, పుస్తక నిల్వలు, పాఠకులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం గ్రంథాలయ నిర్వాహకులు, పాఠకులతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల ప్రకారంగా గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగాల భర్తీ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేస్తుండటంతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ గ్రంథాలయాల్లో పాఠకులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులకు, అవసరమైన పత్రికలు, పుస్తకాలు, ఇతర మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షల అభ్యర్థులు గ్రంథాలయాల్లో లభించే మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం బెల్లంపల్లి డంప్‌యార్డును పరిశీలించారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ జి.మల్లారెడ్డి, శాఖ గ్రంథాలయ అధికారి గోపి, సంబంధిత అధికారులు, పాఠకులు ఉన్నారు.

## గని ప్రాంతంలో మళ్లీ నిర్మాణ పనులు



కందకంలో నింపిన బండరాళ్లు

**బెల్లంపల్లి:** మున్సిపాలిటీ పరిధి 31వార్డు మూసివేతకు గురైన సౌత్ క్రాస్ కట్ గని హాలర్‌ను ఆనుకుని అక్రమకట్టడం నిర్మాణ పనులు మళ్లీ మొదలయ్యాయి. వారం రోజుల క్రితం సింగరేణి ఎస్అండ్‌పీసీ సిబ్బంది వెళ్లి గని పరిసరాల్లో అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణ పనులను అడ్డుకున్న సంగతి తెలిసిందే. దీంతో కొద్ది రోజుల పాటు ఆ ప్రాంతంలో నిర్మాణ పనులు జరగలేదు. తీరా సోమవారం రాత్రి యధాతథంగా కొందరు వ్యక్తులు పునాది త్రవ్విన కందకంలో బండరాళ్లను నింపడం, మట్టి త్రవ్వకం పనులు చేపట్టడంతో స్థానికులు గమనించి ఎస్అండ్‌పీసీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఆ సిబ్బంది అక్కడికి రాకపోవడంతో మందమర్రి సింగరేణి ఎస్టేట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఎస్టేట్ అధికారులు ఆ రాత్రినే సిబ్బందితో వచ్చి పనులను నిలిపి వేయించారు. నిర్మాణ పనులు చేపట్టిన సామగ్రిని వ్యాన్‌లో తీసుకువెళ్లారు. సౌత్‌క్రాస్ కట్ గని ఉపరి తలంలో బుంగ పడి ప్రమాదకరంగా తయారైన ప్రాంతానికి అత్యంత చేరువలో శాశ్వత కట్టడాలను నిర్మించొద్దనే ఆంక్షలు ఉన్నా కూడా, అదేమీ లెక్కచేయకుండా అక్రమార్కులు రాత్రి పూట పునాది పనులు చేపట్టడం చర్చనీయాంశమైంది. కంపెనీ ఖాళీ స్థలాలను అక్రమంగా కబ్జా చేసి కొందరు రూ.లక్షల్లో అమ్మకాలు చేయడం, అభం శుభం తెలియనివ్యక్తులు ఆ స్థలాన్నీ కొనుగోలు చేసి మోసపోతున్నారు. కాగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా ఎస్అండ్ పీసీ సిబ్బంది స్పందించక పోవడంపై బస్తీ వాసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ స్థలాన్ని కబ్జా చేసి అమ్మకాలు చేస్తున్న వ్యక్తులపై నిఘా పెట్టామని, తగిన సమయంలో చర్యలు తీసుకుంటామని ఎస్టేట్ విభాగంలో పనిచేస్తున్న ఓ అధికారి 'సాక్షి'కి తెలిపారు.


## భవన నిర్మాణ కార్మిక సంఘం ఎన్నికలు

**పాతమంచిర్యాల:** జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఆ సంఘం ఎన్నికలను రాష్ట్ర అధ్యక్షుడు కామల్ల ఐలయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా పడాల రామన్న, ఉపాధ్యక్షుడిగా గుండా లచ్చన్న, ప్రధాన కార్యదర్శిగా మంచర్ల సదానందం, కోశాధికారిగా అశోక్, కార్యదర్శిగా గొల్లపల్లి దుర్గయ్య, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

## కోటిలింగాలపై పట్టింపేది?



బండపై ఉన్న శివుని ఆత్మలింగ రూపం



కోటిలింగాల వద్ద ఉన్న కొల్లుకుంట

- ప్రాచీన చరిత్రకు ఆనవాళ్లుగా..
- ఆదరణ కరువై కనుమరుగయ్యేనా?

**చెన్నూర్‌రూరల్:** సహజ సిద్ధంగా బండరాళ్లకు వెలిసిన కోటిలింగాలు ప్రాచీన చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. పురాతన కాలం నాటి ఈ కోటిలింగాలకు ఎంతో ప్రాచీన చరిత్ర ఉంది. ఇవి మంచిర్యాల జిల్లా చెన్నూర్ నుంచి 5కిలో మీటర్ల దూరంలో ఉన్న నారాయణపూర్ గ్రామ సమీపంలో గోదావరి నది ఒడ్డున వెలిశాయి. సుమారు 1800ఏళ్ల క్రితమే ఈ కోటిలింగాలు వెలిశాయని పురాణాలు చెబుతున్నాయి. ఇచ్చట కోటిలింగేశ్వర ఆలయం ఉన్న ఆనవాళ్లు కూడా ఉన్నాయి. ఇక్కడ ఉన్న బండరాళ్లపై వివిధ రకాల దేవతామూర్తులు కొలువుదీరారు. పార్వతి కొల్లుకుంట, పాయిరాల కొలను, యమకోనం, వినాయక విగ్రహాలు, శివలింగం, శివుని ఆత్మలింగ రూపాలు, పార్వతి, నంది, నంది పాదం గుర్తులు మనకు దర్శనమిస్తాయి.

**కాకతీయుల కాలంలో ప్రత్యేక పూజలు...**

అగస్త్య మహాముని కత్తెరసాలలో వెలిసిన మల్లిఖార్జునస్వామి ఆలయం నుంచి సొరంగ మార్గం ద్వారా కోటిలింగాలకు వెళ్లి స్నానమాచరించి శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించేవారని కాశేశ్వర ఖండం చెబుతోంది. కాకతీయులు పరిపాలించే కాలంలో రాజులు ఇక్కడ ప్రత్యేక పూజలు చేసేవారని స్థల పురాణంలో ఉంది. కాకతీయుల కాలంలో గోదావరి నది ఒడ్డున బండరాళ్లపై కోటిలింగేశ్వర ఆలయం కట్టించినట్లు చరిత్ర చెబుతోంది. కానీ రానురాను కోటిలింగేశ్వర ఆలయం పూర్తిగా ధ్వంసమైంది. కోటిలింగాల వద్ద ఉన్న గోదావరి నదిలో ఎల్లప్పుడు నీటి ప్రవాహం ఉంటుంది. ఇక్కడ బండరాతితో చక్కని ఆకృతితో చెక్కినట్లు ఉన్న కొల్లు కుంట ఇందుకు సజీవసాక్ష్యంగా నిలుస్తోంది. ఏటా మహాశివరాత్రి పర్వదినాన ఇక్కడకు భక్తులు వచ్చి స్నానం ఆచరించి కోటిలింగాలకు పూజలు నిర్వహిస్తారు. బండలపై వెలిసిన కోటిలింగాలు రాను రాను గోదావరి నీటి ప్రవాహానికి చిన్నవిగా మారినట్లు చెప్పుకుంటున్నారు. అలాగే ఇక్కడి బండరాళ్లపై చక్కని ఆకృతితో చెక్కినట్లుగా కొల్లుకుంట దర్శనమిస్తుంది.

**ఆదరణ కరువు...**

2013నవంబర్ నెలలో కోటిలింగాల వద్ద గోదావరి నదిలో ఓ భక్తుడు స్నానం ఆచరిస్తుండగా బండరాళ్ల మధ్య శివలింగం, పార్వతి, నంది, వినాయకుల విగ్రహాలు బయట పడ్డాయి. ఈ విగ్రహాలను అక్కడే నది ఒడ్డున ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. డిసెంబర్‌లో దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారి కోటి లింగాలను పరిశీలించారు. కానీ ఇక్కడ ఏమాత్రం అభివృద్ధి పనులు జరగలేదు.

### అధ్యక్షుడిగా విజయ్

**జైపూర్:** మండలంలోని వేలాల గ్రామానికి చెందిన దుర్గం విజయ్‌కుమార్‌ను బీజేవైఎం మండల అధ్యక్షుడిగా నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.